# సింగిల్ పేజీ కథలు

## పొరపాటు

గుహలో నుండి బయటపడ్డట్టు చాలా కష్ట సాధ్యం మీద సిటీబస్సులో నుండి బయటపడ్డాడు రాజారావ్. జైలు నుండి రిలీజ్ అయిన యావజ్జీవ ఖైదీలా ఫీలయ్యాడు.

ఇంటి దగ్గరకు వచ్చాక పిల్లలకు స్టేషనరీ కొనాలన్న విషయం గుర్తొచ్చి పక్కనే వున్న బుక్ స్టాల్‌కేసి నడిచాడు. పర్సు కోసం జేబులో చెయ్యిపెట్టి షాక్ తిన్నాడు రాజారావ్. జేబు ఖాళీగా వుంది! అంటే... ఆఫీసు నుండి సిటీబస్సులో వస్తుంటే ఎవడో తన పర్సు కొట్టేశాడన్నమాట! అందులో మూడువేల రూపాయలున్నాయి. ఇంటికి కావాల్సిన సరుకులు తేవడానికి పెట్టుకున్న డబ్బు అది.

ఇంటికి వెళ్ళగానే తన భార్య ఆ మూడువేలు అడుగుతుంది. ఏం సమాధానం చెప్పాలి? నిజం చెబితే అర్థం చేసుకోదు. పైపెచ్చు నాలుగైదు రోజులు నా చేతగానితనాన్ని దెప్పిపొడుస్తూ సూటి పోటి మాటలు మాట్లాడుతుంది. ఇప్పుడేం చేయాలి? చివరికి ఇంట్లో చెప్పకపోవడమే మంచిదన్న నిర్ణయానికి వచ్చాడు రాజారావ్.

నెలలో చివరి రోజులు కాబట్టి తన ఫ్రెండ్స్‌లో ఎవర్ని అడిగినా ప్రయోజనం ఉండదని తనకి తెలుసు. ఇక తను అడగ్గానే డబ్బు ఇచ్చేది వడ్డీ వ్యాపారి శ్రీశైలం ఒక్కడే!

అతని దగ్గర్నుంచి మూడువేలు అప్పు తీసుకుని "థ్యాంక్స్" అన్నాడు రాజారావ్.

"నీ బోడి థ్యాంక్స్ ఎవడిక్కావాలి. నెల తర్వాత అసలు, వడ్డీ తెచ్చివ్వు" అన్నాడు పాన్ నములుతూ శ్రీశైలం. అతను ఆమాట నిజంగా అన్నాడని తెలిసినా జోక్ అయినట్టు రాని నవ్వును తెచ్చుకుని నవ్వేశాడు రాజారావ్.

* * *

ఇంటికొచ్చిన భర్తకి కాఫీ ఇస్తూ "ఏవండీ... ఆ మూడువేలు ఇవ్వండి. నేనెళ్ళి సరుకులు తీసుకుని వస్తాను" అంది భార్య భావన.

తన పర్సు బస్సులో ఎవడో కొట్టేశాడని చెబితే తన భార్య రియాక్షన్ ఎలా వుంటుందో చూద్దామని "సారీ భావనా! బస్సులో నా పర్సు ఎవడో దొంగ వెధవ కొట్టేశాడు" అన్నాడు రాజారావ్ మొహం దీనంగా పెట్టి.

"ఓరి దేవుడో! మూడువేలు పోగొట్టుకుని వచ్చి, ఆ విషయాన్ని ఇంత నింపాదిగా చెబుతున్నారా! బస్సులో ఎవడో మీ పర్సు కొట్టేస్తుంటే మీరేం చేస్తున్నారు? నిద్రపోతున్నారా? ఆ మాత్రం స్పృహ లేకుండా వుంటారా! నెల రోజులకు సరిపడే సరుకులొచ్చేవి... మీరిచ్చే ఐదువేలతో ఎలాగోలా ఇల్లు గడుస్తోంది. వీలైనంత పొదుపుగా



నేను సర్దుకుపోతుంటే, మీరిలా వేలకి వేలు పోగొట్టుకుని వస్తే ఎలాగండీ?" అంటూ నా నా లెక్కలు వేస్తూ నా అసమర్థతను ఎండగట్టింది.

"ఏయ్ భావనా! ఆపు నీ ఏడుపు... ఎందుకలా గొడవ చేస్తావ్? ఊరికే సరదాగా అబద్ధం చెప్పాను... ఇదిగో మూడువేలు!" అని ఇచ్చాడు రాజారావ్.

ఏమాత్రం గిల్టీనెస్ లేకుండా ఆ మూడువేలు తీసుకుని కిరాణాషాపుకి వెళ్ళిపోయింది భావన. తన భార్య నైజాన్ని గురించి ఆలోచిస్తూ మంచం మీద పడుకున్నాడు.

ఆరోజు ఉదయం జరిగిన సంఘటన గుర్తొచ్చింది అతనికి.

భావన స్టౌవ్ మీద నుండి పాలు దించుతూ పొరపాటుగా కింద పడేసింది. హాల్లో పేపర్ చదువుకుంటూ వున్న తను గిన్నె పడిన శబ్దం విని పరుగెత్తుకుంటూ కిచెన్‌లోకి వెళ్ళి "ఏమైంది?" అన్నాడు.

"పొరపాటుగా జారి కింద పడిపోయిందిలే" అని బట్టతో నేల తుడవడం మొదలుపెట్టింది.

"నీమీద ఏమైనా పడ్డాయా?" అడిగాడు తను.

"లేదు" అని ముక్తసరిగా సమాధానం చెప్పింది.

తనమీద నాకున్న అభిమానం నామీద తనకెందుకు లేదు. అలాంటి పొరపాటు తనిప్పుడు చేస్తే తను అర్థం చేసుకోదు.

పొరపాటుకు పది రూపాయల పాలైనా, పదివేలు డబ్బు అయినా ఒక్కటే! అర్థం చేసుకోనివాళ్లకు అబద్ధం చెప్పడంలో తప్పులేదని తనకి తానే సర్ది చెప్పుకున్నాడు.

కొన్ని క్షణాలు కూడ గడవకముందే భార్యకి తన మీద ఎంతో ప్రేమ ఉందని తెలియజేసే కొన్ని సంఘటనలు మనసులో సినిమా రీలులా తిరిగాయి.

ఎందుకు తను ఆమెను సరిగా అర్థం చేసుకోలేకపోతున్నాడు? తప్పు తనలో ఉందా? ఆమెలోనా?

దీర్ఘంగా ఆలోచించి 'మరో యాంగిల్లో ఆలోచించి చూద్దాం!' అనుకున్నాడు.

డబ్బు పోయిందని చెప్పగానే ఆమె అన్న మాటలు వరసగా గుర్తుకొచ్చాయి. ఆ మాటలు మళ్లీ రివైండ్ చేసుకున్నాడు. చివరగా అన్న మాటలు గుర్తుకొచ్చాయి. "...వీలైనంత పొదుపుగా నేను సర్దుకుపోతుంటే, మీరిలా వేలకి వేలు పోగొట్టుకుంటే ఎలాగండీ" అంది. అలా అంటున్నప్పుడు ఆమె కళ్లల్లో సన్నటి నీటిపొర తన దృష్టి నుంచి దాటిపోలేదు. కానీ అప్పుడు తను దాన్ని అంతగా పట్టించుకోలేదు. ఇప్పుడు ఆలోచిస్తే, కష్టపడి సంపాదించే డబ్బు పట్ల జాగ్రత్త కూడ అంతగానే ఉండాలనే ఆమె ఆంతర్యం తనకి అర్థమైంది.

ఇకముందు తన జేబులో ఎక్కువ డబ్బు ఉన్నప్పుడు, దానిపట్ల తగిన జాగ్రత్త వహించాలని నిర్ణయం తీసుకున్నాక, రాజారావ్‌కి హాయిగా నిద్రపట్టింది.

-ఎం.గాంధీ (హైదరాబాద్)

## గులాబీలు

సాయంత్రం అయిదు గంటలు అవుతోంది.

లక్ష్మి గేటు దగ్గర నిలబడి కూతురు వీణ కోసం ఎదురుచూస్తోంది. రోజూ ఈ సమయానికి వచ్చేది. బస్సు దొరకలేదేమో అనుకుంటూ లోపలికి వచ్చింది. ఇంతలో "అమ్మా" అంటూ వీణ లోపలికి వచ్చింది.

"ఏమ్మా.. ఈరోజు లేటయ్యిందే?" అని లక్ష్మి అడిగింది.

"మా కాలేజీలో సెమినార్ జరిగిందమ్మా, అందుకే ఆలస్యం అయింది. అమ్మా.. చాలా ఆకలిగా ఉంది" అంది ఏమైనా పెట్టమన్నట్టు.

"నీకు ఇష్టమని మిరపకాయబజ్జీలు చేసి ఉంచాను. కాళ్ళు కడుక్కొని రా" అంది.